## క్లుప్తంగా

### తుపాన్‌పై అప్రమత్తంగా ఉండాలి

**నెల్లూరు రూరల్:** తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆర్డీఓ మలోల శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. తీర ప్రాంత మండలాల ప్రజలు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని మండలాల వారు తుపాన్ ప్రభావిత సమస్యలను 0861 – 2331635, 98499 04061 నంబర్లకు తెలియజేయాలని కోరారు.

### పౌష్టికాహార పంపిణీ



మాట్లాడుతున్న ధనూర్జ

**నెల్లూరు సిటీ:** ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని బీవీనగర్‌లో 50 మంది హెచ్‌ఐవీ బాధితులకు పౌష్టికాహారాన్ని ఎన్నెన్పీ ప్లస్ ఆధ్వర్యంలో శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆటల పోటీలను నిర్వహించారు. జిల్లా ఎయిడ్స్ నివారణ విభాగ అదనపు అధికారి శివనాగరాజు, ఎన్నెన్పీ ప్లస్ అధ్యక్షురాలు ధనూర్జ, ఎన్‌సీసీ కో ఆర్డినేటర్ ఉదయ్‌శంకర్, డాక్టర్ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ‘సలార్’ ట్రైలర్ విడుదల



**నెల్లూరు సిటీ:** చిల్డ్రన్స్ పార్క్ మెయిన్ రోడ్డులోని ఎస్ – కేఫ్‌లో సలార్ చిత్ర ట్రైలర్‌ను రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి విడుదల చేశారు. వెంగమాంబ డిస్ట్రిబ్యూటర్స్ ఆధ్వర్యంలో నరేంద్ర, మల్లికార్జున సమక్షంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వెంగమాంబ సినిమాస్ డిస్ట్రిబ్యూటర్స్ మరిన్ని భారీ చిత్రాలను విడుదల చేయాలని కాంక్షించారు. కేతంరెడ్డి వినోద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కోవాలి



మాట్లాడుతున్న హరినారాయణన్

**నెల్లూరు (దర్గామిట్ట):** జిల్లాకు ఈ నెల మూడు నుంచి ఐదు వరకు తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండటంతో పాటు ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. తుపాన్ నేపథ్యంలో అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌ను నగరంలోని తన క్యాంప్ కార్యాలయం నుంచి శుక్రవారం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం సంభవించకుండా అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్.. 1077 కాల్ సెంటర్.. 24 గంటలు పనిచేసేలా సిబ్బందిని నియమించామని తెలిపారు. తాగునీటికి ఇబ్బందుల్లేకుండా అన్ని వాటర్ ట్యాంకుల యజమానులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. రేషన్ సరుకులను త్వరగా పంపిణీ చేయాలని ఆదేశించారు. జేసీ కూర్మనాథ్, కమిషనర్ వికాస్ మర్మత్ తదితరులు పాల్గొన్నారు.

### నేర నియంత్రణ చర్యలపై అవగాహన



**నెల్లూరు(క్రైమ్):** నేరాల నియంత్రణకు చేపడుతున్న చర్యలకు ప్రజలు సహకరించాలని వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ నారాయణ కోరారు. దొంగతనాలు, చైన్ స్నాచింగ్, సైబర్ మోసాల కట్టడికి చేపట్టాల్సిన చర్యలపై వెంగళరావునగర్‌లో అవగాహన కార్యక్రమాన్ని వేదాయపాళెం పోలీసులు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చైన్ స్నాచింగ్‌కు గురైతే నిందితుల ఆనవాళ్లతో పాటు వారు ఉపయోగించిన బైక్ నంబర్‌ను గుర్తుంచుకొని పోలీసులకు తెలియజేస్తే నేరస్తులను పట్టుకునేందుకు దోహదపడుతుందని చెప్పారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలని కోరారు. దిశ యాప్‌ను మహిళలు తమ ఫోన్లలో ఇన్‌స్టల్ చేసుకోవాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు తిరుగుతున్నా.. చట్టవ్యతిరేక కార్యక్రమాలు జరుగుతున్నాయని గుర్తించినా 94407 96304, 94407 96319, డయల్ 112కు సమాచారం అందించాలని కోరారు. ఎస్సై అంకమ తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలి

• ఎమ్మెల్యే అనిల్‌కుమార్



పార్టీలో చేరిన వారితో అనిల్‌కుమార్

**నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట):** రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పిలుపునిచ్చారు. నగరంలోని ఐదో డివిజన్ అహ్మద్‌నగర్‌కు చెందిన నాగుల బాలాజీ, వారి మిత్ర బృందం దాదాపు 100 మంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో శుక్రవారం చేరారు. నగరంలోని రాజన్నభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వీరికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు.. అభివృద్ధిని చూసి ఆకర్షితులై పార్టీలో చేరిన వారికి కృతజ్ఞతలను తెలియజేశారు. శంకరయ్య, శ్రీనివాసులు, ఝాన్సీ, దివ్య, నరసమ్మ, కృష్ణ, వెంకటేశ్వర్లు తదితరులు పార్టీలో చేరారు. కార్పొరేటర్ ఓబిలి రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



**నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట):** నగరంలోని 47వ డివిజన్ గుప్తా పార్కు నుంచి ములుమూడి బస్టాండ్ వరకు రూ.36 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు శంకుస్థాపనను నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. డివిజన్లో ఇప్పటికే రూ.నాలుగు కోట్లతో అభివృద్ధి పనులను చేపట్టామని తెలిపారు. స్వర్ణకారుల భవన్ నిర్మాణానికి సంక్రాంతి తర్వాత శంకుస్థాపన చేయనున్నామని వివరించారు. డివిజన్ సమీప ప్రాంతాల వారు కర్మక్రతువులు చేసుకునేందుకు వీలుగా పెన్నా ఒడ్డున భవనాన్ని నిర్మిస్తున్నామని తెలిపారు. నారాయణరావుపేటలో భూగర్భ డ్రైనేజీ పనులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని పూర్తి చేస్తామన్నారు. కార్పొరేటర్ పొట్లూరి రామకృష్ణ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

# సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట

• ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి



అర్జీలను స్వీకరిస్తున్న తిరుమలేశ్వరరెడ్డి

**నెల్లూరు(క్రైమ్):** సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని.. అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూ పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి కాంక్షించారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ వెల్ఫేర్ డేను శుక్రవారం నిర్వహించారు. వీఆర్, సర్వీస్, అనారోగ్యం, బదిలీలు, పదోన్నతులు, క్రమశిక్షణ చర్యలకు సంబంధించిన అర్జీలను ఎస్పీ స్వీకరించారు. సిబ్బంది, వారి కుటుంబసభ్యులకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలు.. ఆరోగ్యపరమైన.. అపరిష్కృతంగా ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ఏఎస్పీ హిమవతి తదితరులు పాల్గొన్నారు.

# క్రీడా మైదానాల ఏర్పాటుకు వినతి



డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రమిస్తున్న నేతలు

**నెల్లూరు(బారకాసు):** నగరంలో క్రీడా మైదానాల ఏర్పాటుతో పాటు క్రీడాకారులకు కిట్లను అందజేయాలని డీవైఎఫ్‌ఐ నగర కార్యదర్శి నరసింహ కోరారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ చెన్నుడికి వినతిపత్రాన్ని శుక్రవారం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. నగర నియోజకవర్గ పరిధిలో మినీ స్టేడియాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. డీవైఎఫ్‌ఐ నగర నేతలు జగదీష్, శేఖర్, సుబ్బరాయుడు, మణి, నాగేంద్ర, జీవ, మధు తదితరులు పాల్గొన్నారు.

# పదిన వనభోజనాలు



మాట్లాడుతున్న నేతలు

**నెల్లూరు(మినీబైపాస్):** కార్తీక మాస వనభోజన కార్యక్రమాన్ని డిసెంబర్ పదిన నిర్వహించనున్నామని కుమ్మర శాలివాహన సంఘ జనరల్ సెక్రటరీ శ్రీనివాసులు పేర్కొన్నారు. ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడారు. తోటపల్లి గూడూరు మండలంలోని కాటేపల్లి శివాలయ సమీపంలో కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని చెప్పారు. శెట్టిగుంటరోడ్డు, వేదాయపాళెం నుంచి బస్సులను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు.

# 4న ఘంటసాల జయంతి



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

**నెల్లూరు(బృందావనం):** మధుర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు జయంతిని పురస్కరించుకొని నగరంలోని పురమందిరంలో సాంస్కృతిక కార్యక్రమాలు, పాటలు, డ్యాన్స్ పోటీలను సోమవారం నిర్వహించనున్నామని నిర్వాహకుడు కేతా సుబ్బారావు పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను పురమందిరంలో శుక్రవారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. సంగీత విభావరి, కోలాట ప్రదర్శనలతో పాటు పలు కార్యక్రమాలను నిర్వహించనున్నామని వివరించారు. అమానుల్లాఖాన్, రవీంద్ర, రమణయ్య, మహేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఎయిడ్స్‌పై అప్రమత్తంగా ఉండాలి



**నెల్లూరు (టౌన్):** ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సును ఆర్‌ఐఓ, ఇన్‌చార్జి ప్రిన్సిపల్ శ్రీనివాసరావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన పెయింటింగ్ ఎగ్జిబిషన్‌ను డీవీఈఓ మధుబాబు, ఆర్‌ఐఓ ప్రారంభించారు. వ్యర్థ పదార్థాల నుంచి సృజనాత్మకతతో కళారూపాలను రూపొందించిన విద్యార్థులను అభినందించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపల్ రవీంద్రనాథ్, ఎన్‌ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు కరుణకుమారి, ప్రసన్న, భారతి, అధ్యాపకులు వెంకటేశ్వర్లు, వెంకట్రావు, పూర్ణచంద్రకుమారి, కృష్ణతులసి తదితరులు పాల్గొన్నారు.

## రానున్న ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీని ఆదరించాలి



సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరణ



నాలుగో డివిజన్లో..

**నెల్లూరు రూరల్:** రానున్న ఎన్నికల్లోనూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి కోరారు. ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని 12వ డివిజన్లోని అల్లీపురంలో శుక్రవారం నిర్వహించారు. అనంతరం సచివాలయం ఎదుట పార్టీ జెండా.. అభివృద్ధి, సంక్షేమ వివరాలను తెలిపే బోర్డులను ఆవిష్కరించారు.

**నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట):** ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నగరంలోని మూడు డివిజన్లలో నిర్వహించారు. నాలుగో డివిజన్ మారుతి నగర్ సచివాలయ పరిధిలో కార్పొరేటర్ పోలంరెడ్డి లక్ష్మీప్రత్యూష ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని జరిపారు. సంక్షేమం, అభివృద్ధి వివరాలను తెలిపే బోర్డుతో పాటు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. 11వ డివిజన్ వెంగళరావునగర్ – 1 సచివాలయ పరిధిలో కార్పొరేటర్ గోతం అరుణ, 50వ డివిజన్ ఖాజీపేట సచివాలయ పరిధిలో గుంజి జయలక్ష్మి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు.

### మాగుంట సుబ్బరామిరెడ్డికి నివాళి

**నెల్లూరు(బృందావనం):** మాజీ ఎంపీ మాగుంట సుబ్బరామిరెడ్డి వర్ధంతిని నగరంలోని ఎం -1 థియేటర్స్‌లో శుక్రవారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సుబ్బరామిరెడ్డి మనవడు జూనియర్ మాగుంట సుబ్బరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే శేషారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గంగాధరం, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, పత్తి రవీంద్రబాబు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత కొడవలూరు ధనుంజయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### భవానీ శంకరుడికి విశేష పూజలు



**నెల్లూరు(బృందావనం):** కార్తీక మాసాన్ని పురస్కరించుకొని వేదాయపాళెంలోని కృష్ణ మందిర ప్రాంగణంలో కొలువైన భవానీ శంకరుడికి విశేష పూజలను శుక్రవారం నిర్వహించారు. ఆకాశ దీపాన్ని వెలిగించారు. ఉభయకర్తలుగా విజయశ్రీనివాస్, ప్రసన్నలక్ష్మి దంపతులు వ్యవహరించారు.

### రేపట్నుంచి అగ్రిటెక్ సదస్సు

**నెల్లూరు(సెంట్రల్):** గుంటూరులోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అగ్రిటెక్‌ను ఆదివారం నుంచి మంగళవారం వరకు నిర్వహించనున్నారని కృషి విజ్ఞాన కేంద్ర ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ లలితా శివజ్యోతి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నూతన వంగడాలు, ఆధునిక వ్యవసాయ యంత్ర పరికరాలతో పాటు నూతన వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించనున్నారని చెప్పారు. జిల్లాలోని రైతులు తరలిరావాలని, వివరాలకు బీవీనగర్‌లోని కేవీకేను సంప్రదించాలని సూచించారు.

### ఎస్‌ఎఫ్‌ఐ నేతల నిరసన

**నెల్లూరు(దర్గామిట్ట):** విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చలో కలెక్టరేట్‌ను ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. అపరిష్కృతంగా ఉన్న వివిధ సమస్యలను నెరవేర్చాలని కోరారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాలాజీ, సిటీ, రూరల్ కార్యదర్శి నరేంద్ర, సంతోష్, అశ్విన్, ఉదయ్, అజయ్, బాషా, సుమంత్, జీవన్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

### వేడుకగా శీవేలి ఉత్సవం

**నెల్లూరు(బృందావనం):** మండల పూజలను పురస్కరించుకొని నగరంలోని అయ్యప్ప స్వామి దేవస్థానంలో శీవేలి ఉత్సవం తదితరాలను భక్తిశ్రద్ధలతో శుక్రవారం నిర్వహించారు. ఉభయకర్తలుగా మండవ వెంకటశ్రీనివాసరావు, ధనలక్ష్మి దంపతులు వ్యవహరించారు. అయ్యప్ప సేవా సమాజ పాలకమండలి అధ్యక్ష, కార్యదర్శులు శేషగిరిరావు, వెంకటరత్నం, కోశాధికారి రత్నయ్య, మోహన్‌రావు, శంకరన్, మురళీమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### 15 వరకు ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్

**నెల్లూరు రూరల్:** రూరల్ మండలంలోని గ్రామాల్లో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్‌ను ఈ నెల 15 వరకు నిర్వహించనున్నామని ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలేంద్రకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుత సీజన్లో అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టనున్నామని వివరించారు. సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో డ్రైవ్‌ను నిర్వహించాలన్నారు. ఆయా గ్రామాల్లో పారిశుధ్య సమస్యలను 97042 52164 నంబర్‌కు తెలియజేయాలని ప్రజలను కోరారు.





దీపాలను వెలిగిస్తూ..

## దేదీప్యం.. కార్తీక లక్షదీపోత్సవం

పవిత్ర కార్తీక మాసాన్ని పురస్కరించుకొని నగరంలోని వీఆర్సీ మైదానంలో కార్తీక మాస లక్ష దీపోత్సవాన్ని కనులపండువగా శుక్రవారం ప్రారంభించారు. వీపీఆర్ ఫౌండేషన్, కార్తీక మాస లక్ష దీపోత్సవ కమిటీ ఆధ్వర్యంలో.. రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, టీటీడీ ఢిల్లీ స్థానిక సలహామండలి చైర్‌పర్సన్ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతుల పర్యవేక్షణలో మూడు రోజుల పాటు కార్యక్రమాన్ని అంగరంగవైభవంగా నిర్వహించనున్నారు.

– నెల్లూరు(బృందావనం)



వైద్యనాథ్ జ్యోతిర్లింగానికి అభిషేకం చేస్తున్న ప్రసన్నకుమార్‌రెడ్డి





నృత్య ప్రదర్శన



ఆదియోగి ప్రతిమ



విద్యుద్దీపాలతో ఏర్పాటు చేసిన దేవతామూర్తుల కటౌట్

# పేదల పక్షపాతి సీఎం జగన్



ఉమ్మారెడ్డిగుంటలో ర్యాలీ

**నెల్లూరు(బారకాసు):** సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతి అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళాధ్యక్షురాలు, 21వ డివిజన్ కార్పొరేటర్ మొయిళ్ల గౌరి పేర్కొన్నారు. ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని డివిజన్ పరిధిలోని 21 / 4 సచివాలయం, ఉమ్మారెడ్డి గుంటలో శుక్రవారం నిర్వహించారు. తొలుత ర్యాలీని జరిపారు. కార్పొరేటర్లు విజయభాస్కర్ రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, పాతపాటి పుల్లారెడ్డి, జేసీఎస్ మండల ఇన్‌చార్జి మొయిళ్ల సురేష్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్లు వెంగళ్‌రెడ్డి, సాయి, మాల్యాద్రి, పెంచలనర్సారెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సచివాలయాల ద్వారా లీగల్ మెట్రాలజీ సేవలు



మాట్లాడుతున్న సాంబశివారెడ్డి

**నెల్లూరు(పొగతోట):** లీగల్ మెట్రాలజీ సేవలను గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి పేర్కొన్నారు. నగరంలోని డీఆర్డీఏ కార్యాలయం నుంచి వివిధ మండలాల అధికారులు, ఉద్యోగులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లీగల్ మెట్రాలజీ సేవలకు సంబంధించిన శిక్షణ కార్యక్రమాలను డివిజనల్ స్థాయిలో ఈ నెల ఐదున నిర్వహించనున్నామని వెల్లడించారు. శిక్షణకు సచివాలయ ఉద్యోగులు తప్పక హాజరయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. ఆడుదాం.. ఆంధ్రా కార్యక్రమానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు.

# నగదు డిమాండ్ చేస్తే చర్యలు



మాట్లాడుతున్న కామాక్షయ్య

**నెల్లూరు(పొగతోట):** స్త్రీ నిధి రుణాల మంజూరులో స్వయం సహాయక గ్రూపు మహిళల నుంచి నగదును డిమాండ్ చేసే వారిపై కఠిన చర్యలు చేపడతామని స్త్రీ నిధి ఏజీఎం కామాక్షయ్య పేర్కొన్నారు. స్త్రీ నిధి రుణాలపై నగరంలోని డీఆర్డీఏ కార్యాలయంలో ఉద్యోగులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023 – 24 ఆర్థిక సంవత్సరంలో రూ.142 కోట్ల స్త్రీ నిధి రుణాలు మంజూరు చేయాలనే లక్ష్యానికి గానూ ఇప్పటి వరకు 15487 మందికి రూ.82.93 కోట్లను అందజేశామని వెల్లడించారు. మంజూరు చేసిన రుణం.. ప్రతి నెలా ఎంత చెల్లించాలి.. ఎన్ని నెలలు చెల్లించాలనే అంశమై సభ్యులకు అవగాహన కల్పించాలని సూచించారు.

# విద్యార్థులకు పుస్తకాల అందజేత



**నెల్లూరు(సెంట్రల్):** నగరంలోని పోస్టల్ కాలనీలో చిన్నారులకు నోట్స్ పుస్తకాలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత మదన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పారిశ్రామికవేత్త పర్వతరెడ్డి బలరామిరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని బలరామిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ట్రస్టీలు స్రవంతి, సురేష్, వెంకటరమణ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. డాక్టర్ మోహన్‌కృష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో సహస్ర శంఖాభిషేకం



**నెల్లూరు(బృందావనం):** మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామికి సహస్ర శంఖాభిషేకం, ప్రాకారోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో శుక్రవారం నిర్వహించారు. ఉభయకర్తలుగా ఊరిబిండి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి, ఈదూరు రామ్మోహన్ రెడ్డి, సుప్రియ, విజయానంద్, శ్రీదేవి దంపతులు వ్యవహరించారు.

# వేదగిరిలో విద్యారణ్యభారతి పూజలు



**నెల్లూరు రూరల్:** నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానాన్ని హంపీ విరూపాక్ష విద్యారణ్యభారతి శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన్ను సత్కరించి ప్రసాదాలు, చిత్రపటాన్ని అందజేశారు.